క్లుప్తంగా

మున్సిపాలిటీ నిధులు, ఖర్చుల వివరాలివ్వండి


కమిషనర్‌కు వినతి పత్రమిస్తున్న కౌన్సిలర్ ఆరి శంకరయ్య

వెంకటగిరి(సైదాపురం) : వెంకటగిరి మున్సిపాలిటీకి మంజూరైన నిధులు, చేసిన ఖర్చుల వివరాలు ఇవ్వాలని 14వ వార్డు కౌన్సిలర్ ఆరిశంకరయ్య కోరారు. ఆయన గురువారం మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ శ్రీనాథ్‌కు వినతి పత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ 14, 15వ ఆర్థిక ప్రణాళిక నిధుల మంజూరు, వాటిని ఏఏ పనులకు ఖర్చు చేశారో తెలపాలన్నారు. సాధారణ నిధులతో పాటు జనరల్ నిధులతో 2021 నుంచి 2025 జనవరి 25వ తేదీ వరకు వార్డుల్లో చేసిన పనులు, మంజూరు చేసిన మొత్తం వివరాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

వాహనాల తనిఖీ


వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్‌ఐ శివశంకర్

డక్కిలి : మండలంలోని వెంకటగిరి–రాపూరు జాతీయ రహదారిలోని మోపూరు రోడ్డు సెంటర్‌లో గురువారం ఎస్‌ఐ శివశంకర్ వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వాహనాలు తనిఖీ చేపట్టామన్నారు. ఎర్రచందనం, గంజాయి, మద్యం అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్టు తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెంట్ ధరించాలన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

కొనసాగుతున్న రీ సర్వే ప్రక్రియ


రీ సర్వే చేస్తున్న సర్వే ప్రత్యేక బృందాలు

గూడూరు రూరల్ : గూడూరు మండలంలోని గొల్లపల్లిలో మూడో రోజు గురువారం కూడా రెవెన్యూ అధికారులు రీ సర్వే కార్యక్రమం నిర్వహించారు. రీ సర్వే డీటీ చైతన్య మాట్లాడుతూ గ్రామంలో సర్వే నంబర్లు 9, 10, 18, 19, 79, 105, 106లలో గ్రౌండ్ ట్రోతింగ్ చేపట్టామన్నారు. రైతుల అనుమానాలు నివృత్తి చేసినట్టు పేర్కొన్నారు. సర్వే పూర్తయిన తర్వాత తప్పులు లేకుండా, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండేలా రైతులకు స్కెచ్ ఇస్తామన్నారు.

కుష్టువ్యాధిపై ఇంటింటా సర్వే


జేపీ పురంలో పరీక్షలు చేస్తున్న డాక్టర్ ప్రమీలారాజకుమారి

రాపూరు : మండలంలోని జోరేపల్లి అక్కమాంబపురంలో గురువారం కుష్టువ్యాధిగ్రస్తుల గుర్తింపు సర్వే చేపట్టినట్టు వైద్యాధికారిణి ప్రమీలా రాజకుమారి తెలిపారు. ఇందులో భాగంగా ఇంటింటికీ వెళ్లి శరీరంపై నొప్పిలేని మచ్చలు తదితరాలపై ఆరా తీస్తున్నట్టు తెలిపారు. ఈ సర్వే వచ్చే నెల 2వ తేదీ వరకు కొనసాగుతుందన్నారు. కుష్టువ్యాధిని ముందుగా గుర్తించి సరైన చికిత్స తీసుకుంటే అంగవైకల్యం నుంచి తప్పించుకోవచ్చని వివరించారు.

బెల్టు షాపులపై దాడి


నిందితుడితో పోలీసులు

వాకాడు : వాకాడు ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని బెల్టుషాపులపై గురువారం ఎక్సైజ్ పోలీసులు దాడులు చేశారు. చిట్టమూరు మండలం వేము గుంటపాళెంలో బెల్టు షాపు నిర్వహిస్తున్న యనమల వెంకటయ్యను అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి 9 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని సీఐ ప్రసాద్ తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి అంత్యక్రియలు

నాయుడుపేట టౌన్ : నాయుడుపేట పట్టణంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలో మురుగు కాలువలో పడి మృతిచెందిన గుర్తు తెలియని వ్యక్తి మృతదేహానికి గురువారం అంత్యక్రియలు చేయించినట్టు సీఐ బాబి తెలిపారు. అతను ఈ నెల 17న మృతిచెందాడన్నారు. అతని ఆచూకీ కోసం చుట్టుపక్కల ప్రాంతాల్లో విచారించినా ఫలితం లేదని పేర్కొన్నారు. ఈ క్రమంలో గురువారం ప్రభుత్వ వైద్యులు పోస్టుమార్టం చేసినట్టు తెలిపారు. మృతదేహానికి మున్సిపల్ కార్మికులతో హిందూ శ్మశానవాటికలో అంత్యక్రియలు చేయించామని వెల్లడించారు. గుర్తుతెలియని వ్యక్తిగా కేసు నమోదు చేసినట్టు పేర్కొన్నారు.

బాలికల వసతి గృహంలో కనిపించని వసతులు


డీవీ సత్రంలోని బాలికల వసతి గృహం

వారంతా పేద పిల్లలు. తల్లిదండ్రులకు ఆర్థిక స్థోమత లేకపోవడంతో హాస్టళ్లలో ఉంటూ చదువుకుంటున్నారు. అక్కడ నిద్ర లేచినది మొదలు పడుకునే వరకు అనుదినం సమస్యలతో సహజీవనం చేస్తున్నారు. ముఖ్యంగా మరుగుదొడ్లు, స్నానం చేసేందుకు బాత్రూమ్‌లు, చదువుకునేందుకు అనువైన గదులు, డైనింగ్ హాల్ లేవు. రాత్రిళ్లు సరైన రక్షణ కూడా కరువైంది. మాది మంచి ప్రభుత్వమనే చెప్పుకునే కూటమి నేతలు సంక్షేమ హాస్టళ్ల గురించి పట్టించుకోవడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.


మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు

- 95 మంది బాలికలకు మూడు గదులే దిక్కు
- పట్టించుకోని అధికారులు

దొరవారిసత్రం: దొరవారిసత్రంలోని ఎస్సీ బాలికల వసతి గృహంలో 95 మంది పిల్లలు ఉంటూ చదువుకుంటున్నారు. అందరికీ కలిపి మూడు గదులు మాత్రమే ఉన్నాయి. అందులోనే వారి పెట్టెలు ఉంచుకుని అక్కడే దుస్తులు ఆరబెట్టుకోవడం, అక్కడే చదువుకోవడం వంటికి చేసుకోవాల్సిన దుస్థితి. డైనింగ్ హాల్ లేకపోవడంతో ఉదయం, రాత్రి సమయాల్లో వరండాలో, ఆరుబయట మట్టిలోనే కూర్చొని భోజనం చేయ్యాల్సిన పరిస్థితి. వారికి మరుగుదొడ్లు 8, బాత్రూమ్‌లు 8 ఉన్నాయి. వాటికి తలుపులు సక్రమంగా లేకపోవడంలో విద్యార్థుల ఇబ్బందులు అంతా ఇంతా కాదు. గత ఏడాది స్వచ్ఛభారత్ కింద కేంద్ర ప్రభుత్వం కేటాయించిన సుమారు రూ.5 లక్షలతో ఆరు మరుగుదొడ్లు, ఆరు బాత్రూమ్‌లు నిర్మించారు. వాటికి ఇప్పటి వరకు నీటి వసతి కల్పించలేదు. సెప్టిక్ ట్యాంక్ ఏర్పాటుచేయలేదు. దీంతో వినియోగంలోని రాకుండానే నిరుపయోగంగా మారాయి. హాస్టల్‌కు ప్రహరీ గోడ లేకపోవడంతో రాత్రిళ్లు బాలికలు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీస్తున్నారు. వసతి భవనంలో ఎక్కడ పడితే అక్కడ ఫ్లోరింగ్‌కు వేసిన నాపరాళ్లు లేచిపోవడంతో తరచూ విద్యార్థులు గాయపడుతున్నారు.

> **మార్చిలోపు అన్ని సమస్యలు తీరుతాయి**
>
> డీవీ సత్రం బాలికల వసతి గృహంలో వివిధ పనుల కోసం రూ.10 లక్షలు మంజూరయ్యాయి. ఇంజినీరింగ్ అధికారులు కూడా వచ్చి పరిశీలించి వెళ్లారు. ఈ నెలాఖరులోపు పనులు మొదలు పెట్టే అవకాశం ఉంది. మార్చి లోపు అన్ని పనులు పూర్తి చేస్తారు. అదేవిధంగా విద్యార్థుల సౌకర్యార్థం స్టడీ ఫ్లాట్ ఫారం, ప్రహరీ గోడ ఎత్తు పెంచడం, మరుగుదొడ్లు, విద్యుత్ సౌకర్యం, శ్లాబ్ తదితర పనులు చేస్తాం.
>
> – శేషమ్మ, వార్డెన్, డీవీ సత్రం బాలికల వసతి గృహం


బాలికల వసతి గృహంలో దెబ్బతిన్న తలుపులు


నిరుపయోగంగా వున్న మరుగుదొడ్లు, బాత్రూమ్‌లు


ఎత్తు తక్కువగా వున్న ప్రహరీ గోడ

ఎలుకల నివారణకు చర్యలు


ఎలుకల నివారణ మందు తయారీపై రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

డక్కిలి /వెంకటగిరి(సైదాపురం) : వరి పంటలో ఎలుకల నివారణకు రైతులు తగిన చర్యలు తీసుకోవాలని తిరుపతి వ్యవసాయశాఖ కార్యాలయ ఏడీఏ ధనుంజయరెడ్డి, వెంకటగిరి వ్యవసాయశాఖ ఏడీఏ నాగార్జున సాగర్ తెలిపారు. వారు గురువారం డక్కిలి మండలం లింగసముద్రం, వెంకటగిరి మండలం వల్లివేడులో గురువారం సామూహిక ఎలుకల నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎలుకల నివారణకు బ్రోమోడమోలోన్ మందు వినియోగించాలన్నారు. ఈ మందును రైతులకు ఉచితంగా అందజేస్తున్నట్టు తెలిపారు. 10 గ్రాములు బ్రోమోడమోలోన్ పొడి మందు, 482 గ్రాముల వరి నూకలు, 10 గ్రాముల వేరుశనగ, కొబ్బరినూనెను కలిపి 10 గ్రాముల చొప్పున పొట్లాలుగా కట్టి ఎలుకల కన్నంలో పెట్టాలన్నారు. రైతులు సామూహికంగా ఎలుకల నివారణ కార్యక్రమం చేపట్టాలన్నారు. అనంతరం సాగులో ఉన్న వరి పంటను పరిశీలించి చీడ పీడల నివారణపై సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో ఏవోలు విజయభారతి, సుజాత, ఏఈవోలు శ్రీహరి, రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.


వెంకటగిరి(సైదాపురం) : అవగాహన కల్పిస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

ఎన్నికల హామీల అమలు కోసం పోరుబాట

- ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎంపీపీ శేఖర్‌రెడ్డి

పెళ్లకూరు : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని కోరుతూ పోరుబాట కార్యక్రమం చేపట్టినట్టు ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి తెలిపారు. ఆయన గురువారం చెంబేడులో విలేకరులతో మాట్లాడారు. ఎన్నికల మేనిఫెస్టోను అమలు చేయాలని కోరే హక్కు ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరికీ ఉందన్నారు. ప్రశ్నించిన వారిపై టీడీపీ నాయకులు వ్యక్తిగత దూషణలకు దిగడం మంచి పద్ధతి కాదన్నారు. గతంలో వైఎస్సార్ సీపీ హయాంలో జగనన్న సంక్షేమం, అభివృద్ధి రెండూ కళ్లుగా భావించి పరిపాలన సాగించారని గుర్తు చేశారు. నాడు–నేడు కింద పాఠశాలలు, ఆస్పత్రులను అభివృద్ధి చేశామన్నారు. గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం కింద పల్లెల్లో సిమెంట్ రోడ్లు వేసినట్టు తెలిపారు. సచివాలయాలు, ఆర్బీకేల ద్వారా ప్రజలకు స్థానికంగా సేవలు అందించామన్నారు. వలంటీర్ ద్వారా ప్రభుత్వ పథకాలను నేరుగా అర్హులకు చేర్చిన ఘనత జగనన్నదని వివరించారు. కూటమి ప్రభుత్వం ప్రతియాభై కుటుంబాలకు బెల్టు షాపు నిర్వహిస్తూ మద్యాన్ని ఏరులై పారిస్తున్నారని విమర్శించారు. ఎవరి పాలనలో మేలు జరిగిందన్న విషయాన్ని అధికార పార్టీ నేతలంతా తమ ఇళ్లల్లో ఉన్న మహిళలను అడిగి తెలుసుకోవాలన్నారు. చంద్రబాబు చెప్పిన అబద్ధాలను నమ్మి మోసపోయామని ప్రజలు బాధపడుతున్నారని తెలిపారు. ప్రజల సమస్యలపై మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య, ఎంపీ గురుమూర్తి నాయకత్వంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పోరాటాలు చేయనున్నట్టు వివరించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బు వెంకటరత్నం, వైస్ ఎంపీపీ బెల్లపు రాఘవరెడ్డి, సర్పంచ్ పిన్నాబత్తిన ధర్మయ్య, ఎంపీటీసీ కుమారస్వామి, నాయకులు ఎల్లు మోహన్, రాజారెడ్డి, మునిరాజా, గోపాలయ్య, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నియమాలు పాటించాలి


ర్యాలీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు రూరల్ : వాహన చోదకులు రోడ్డు నియమాలను పాటిస్తే ప్రమాదాలకు చెక్ పెట్టవచ్చని ఎమ్మెల్యే సునీల్‌కుమార్ తెలిపారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం గూడూరు పట్టణ సమీపంలో ఉన్న ఆదిశంకర ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులకు భద్రతపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ వాహనాల్లో ప్రయాణించే సమయంలో ముందు వెనుక చూడాలన్నారు. కొంతమంది సిగ్నల్ వద్ద కూడా వేగంగా వెళుతుంటారని, దీని వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో గూడూరు ప్రాంతీయ రవాణాశాఖాధికారి కిషోర్, ఎంవీఐలు ఆజాద్ జకీర్, శాంతి, ప్రభాకర్, సిబ్బంది శ్రీదేవి, కళాశాల ప్రిన్సిపాల్ వేణుమాధవ్, ఏవో రామయ్య, రామక్రిష్ణ, ధనుంజయ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లపై వేధింపులు తగదు



ఆటో కార్మిక నిర్మాణ సభలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి ఎస్.శివ

సూళ్లూరుపేట : దేశంలో వ్యవసాయ రంగం తర్వాత ఎక్కువ మంది ఆటో డ్రైవర్లుగా ఉపాధి పొందుతున్నారని, వారిపై వివక్ష తగదని ఏఐటీయూసీ అనుబంధ ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.శివ తెలిపారు. సూళ్లూరుపేట పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం ఆటో డ్రైవర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ నియోజకవర్గ నిర్మాణ సభను నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆటో కార్మికులపై పోలీసులు, రవాణాశాఖాధికారుల వేధింపులు ఆపాలన్నారు. కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి కుటుంబాలకు రక్షణ కల్పించాలని, 60 ఏళ్లు దాటిన ప్రతి ఆటో డ్రైవర్‌కూ నెలకు ఏడు వేలు పింఛను ఇవ్వాలని డిమాండ్ చేశారు. బ్యాంకుల ద్వారా వడ్డీలేని రుణాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. ఈ–చలాన్‌లను రద్దు చేయాలని, అలాగే పెండింగ్‌లో వున్న ఈ–చలాన్‌లను మాఫీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, ప్రమీలమ్మ, సీపీఐ కార్యదర్శి సుధాకర్‌రెడ్డి, ఏఐటీయూసీ కార్యదర్శి నాగేంద్రబాబు, సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి బాలు తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగ అరెస్ట్

నాయుడుపేట టౌన్: పట్టణంలో రెండు మోటార్ బైక్‌లను చోరీ చేసిన నిందితుడు పోలస్వామి వెంకటేష్‌ను గురువారం అరెస్ట్ చేసినట్టు ఎస్‌ఐ ఆదిలక్ష్మి తెలిపారు. పట్టణంలో ఇటీవల రెండు బైక్‌లు చోరీ అయ్యాయి. ఐడీ పార్టీ పోలీసులతో నిఘా పెట్టినట్లు ఆమె వెల్లడించారు. అదేవిధంగా సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా గతంలో పలు చోరీ కేసుల్లో సంబంధం ఉన్న నాయుడుపేట ప్రాంతానికి చెందిన వెంకటేష్‌ను గుర్తించారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని పిచ్చిరెడ్డితోపు వీధిలో ఇంటి వద్ద ఉన్న వెంకటేష్‌ను పట్టుకుని అరెస్టు చేశారు. చోరీకి పాల్పడిన రెండు బైక్‌లను రికవరీ చేసినట్లు ఎస్‌ఐ తెలి పారు. నిందితుడిని కోర్టులో హాజరుపరచగా.. జడ్జి అతనికి రిమాండ్ విధించినట్లు పేర్కొన్నారు.

చిన్నాన్నపై కత్తితో దాడి

నాయుడుపేట టౌన్ : మండలంలోని అత్తలపాళెంలో గురువారం పొలం విషయమై గొడవ పడి ఒక యువకుడు చిన్నాన్నపై కత్తితో దాడి చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు.. అత్తలపాళెం గ్రామంలో రెవెన్యూ అధికారులు పొలాల రీ సర్వే చేస్తున్నారు. ఈ క్రమంలో కండకూరు నాగరాజు, అతని సోదరుడికి పొలాలు ఉన్నాయి. వాటిని రీ సర్వే చేయాలన్న నోటీసు నాగరాజుకు మాత్రమే ఇచ్చారు. తనకు ఇవ్వకపోవడంపై అతని సోదరుడి కుమారుడు సుధాకర్ గొడవ పడ్డాడు. అంతటితో ఆగక వెంట తెచ్చుకున్న కత్తితో చిన్నాన్న నాగరాజుపై దాడి చేసి గాయపరిచాడు. అడ్డు వచ్చిన నాగరాజు భార్య రాణెమ్మపైనా దాడి చేశాడు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గాయపడిన నాగరాజును ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

కండలేరులో 55.336 టీఎంసీల నీరు

రాపూరు : కండలేరు జలాశయంలో గురువారం నాటికి 55.336 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరుకు సోమశిల జలాశయం నుంచి 180 క్యూసెక్కుల నీరు వస్తోందన్నారు. అలాగే కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 800, లోలెవల్ కాలువకు 70, హైలెవల్ కాలువకు 160, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

క్యాలెండర్ ఆవిష్కరణ

నాయుడుపేట టౌన్ : రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ క్యాలెండర్‌ను గురువారం తిరుపతి జిల్లా డీఈవో కేవీఎన్ కుమార్ ఆవిష్కరించారు. ఆర్‌యూపీపీ సంఘం నాయకులు గురువారం తిరుపతిలో డీఈవోను కలిశారు. సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు బి.రవికుమార్, ప్రధాన కార్యదర్శి ఎస్ విజయకుమార్, రాష్ట్ర కార్యదర్శి ఈ రామసుబ్బయ్య, చిట్టేటి కుమార్, చలపతి, ఏ చెంచయ్య, రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

పంటల సాగులో జాగ్రత్తలు అవసరం

నాయుడుపేట టౌన్ : రైతులు పంటల సాగులో జాగ్రత్తలు పాటించాలని జిల్లా వ్యవసాయాధికారి ఎస్ ప్రసాద్ సూచించారు. ఆయన గురువారం మండల వ్యవసాయాధికారి జోగి గణేష్‌తో కలిసి అన్నమేడులో వరి పంటను పరిశీలించారు. ఎలుకల నిర్మూలనకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. విషపు ఎరను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈవో పుట్టయ్య, వీఏఏ ఆదినారాయణ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి


నేతాజీకి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

కోట : నేతాజీ సుభాష్‌చంద్రబోస్ జయంతిని గురువారం బీజేపీ నాయకులు ఘనంగా నిర్వహించారు. తూర్పువీధిలో ఉన్న నేతాజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు స్వీట్లు పంచి పెట్టారు. స్వాతంత్ర్య సంగ్రామంలో నేతాజీ చేసిన పోరాటాలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో రమేష్‌బాబు, వాసు, అంబరీష, వెంకటేశ్వర్లు, వెంకయ్య పాల్గొన్నారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: దేశ స్వాతంత్ర్యం కోసం నేతాజీ సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలు మరువలేనివని పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. పారిచెర్లవారిపాళెం జెడ్పీ ఉన్నత పాఠశాలలో గురువారం నేతాజీ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. ఆయన చిత్ర పటానికి పూల వేసి నివాళులర్పించారు. ఆజాద్ హింద్ ఫౌజ్‌ను ఏర్పాటుచేసి బ్రిటీష వారిపై పోరాటం చేశారని, వారికి ముచ్చెటమలు పట్టించారని వివరించారు. ప్రజల్లో దేశభక్తిని పెంపొందించారని తెలిపారు. ఆయనను నేటి యువత ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వీవీకుమార్, ప్రజేంద్ర రెడ్డి, మాధవయ్య, ఎస్.చంద్రశేఖర్, సురేంద్ర, విద్యుల్లత, మస్తానయ్య తదితరులు పాల్గొన్నారు.

28న ఐటీఐలో జాబ్‌మేళా

చిల్లకూరు : గూడూరు రెండో పట్టణంలోని ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఈ నెల 28న జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఆర్ లోకనాథం ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి.నాగరాజు తెలిపారు. 10వ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత సాధించిన ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించా రు. ఆధార కార్డు, విద్యార్హత, బయోడేటా ఫామ్‌తోపాటు నైపుణ్యం.ఏపీ.జీవోవీ.ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకుని అడ్మిట్ కార్డు తీసుకురావాలని కోరారు.

అంగన్‌వాడీ పోస్టులకు ఐదు దరఖాస్తులు

కోట : కోట ఐసీడీఎస్ ప్రాజెక్ట్ పరిధిలో ఖాళీగా ఉన్న రెండు అంగన్‌వాడీ వర్కర్ల పోస్టులకు ఐదు దరఖాస్తులు అందినట్లు సీడీపీవో మునికుమారి తెలిపారు. కోట మండలంలో నెల్లూరుపల్లి అంగన్‌వాడీ కేంద్రం వర్కర్ పోస్టులకు రెండు, చిట్టమూరు అంగన్‌వాడీ కేంద్రం వర్కర్ పోస్టుకు మూడు దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ మేరకు ఆమె గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

25న మండల సమావేశం

గూడూరు రూరల్ : స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఈ నెల 25న ఎంపీపీ బూదూరు గురవయ్య అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో మధుసూదన్ రావు తెలిపారు. ఈ సందర్భంగా మండలంలో నెలకొన్న సమస్యలపై చర్చ ఉంటుందని తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

నిందితులను తక్షణమే అరెస్టు చేయాలి


ఆందోళన చేస్తున్న ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు

కలువాయి : మండలంలోని వెరుబొట్లపల్లిలో మాదిగ యువకులపై దాడి చేసిన అగ్రకులాల వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ, హత్యాయత్నం కేసు నమోదు చేసి తక్షణమే అరెస్టు చేయాలని ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు డిమాండ్ చేశారు. వారు గురువారం కలువాయిలో రాస్తారోకో చేపట్టారు. ముందుగా బస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ర్యాలీ చేశారు. అక్కడ రోడ్డుపై ధర్నా చేశారు. మాదిగ యువకులపై పెట్టిన కౌంటర్ కేసులు ఎత్తి వేయాలని, గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాలని కోరారు. రోడ్డుపై ధర్నాతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. రాపూరు సీఐ సత్యనారాయణ, కలువాయి, కండలేరు ఎస్‌ఐలు సుమన్, రామకృష్ణ అక్కడికి చేరుకుని వారితో చర్చించి ఆందోళన విరమింపజేశారు. కార్యక్రమంలో గొల్లపల్లి శ్రీనివాసమాదిగ, ఉదయ కృష్ణమాదిగ, పందిటి అంబేడ్కర్ మాదిగ, మందా పెంచలయ్య మాదిగ, దండు పెంచలయ్య, దండు భార్గవ్, నరసయ్య, మల్లెంకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

27 నుంచి బ్రహ్మోత్సవాలు

నారాయణవనం : స్థానిక కనకవల్లీ, వేదవల్లీ సమేత వీరరాఘవస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలకు ఏర్పాటు చేస్తున్నట్లు ఆలయ కమిటీ ధర్మకర్తల మండలి అధ్యక్షుడు సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈనెల 27వ తేదీ రాత్రి విష్వేశ్వర, కలశ పూజలతో అంకురార్పణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయన్నారు. 28న కల్యాణోత్సవం, 29న గరుడ సేవ, 30న చక్రస్నానం, 31న పుష్పయాగంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలిపారు. ఉత్సవాల్లో పుత్తూరు లాస్య తరంగణి వారిచే భరతనాట్య ప్రదర్శన, అన్నమాచార్య ప్రాజెక్ట్ వారిచే కచేరీలు ఏర్పాటు చేసినట్లు సుబ్రహ్మణ్యం తెలిపారు.

భక్తుల సమస్యలు పరిష్కరించండి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల సమస్యలను పరిష్కరించాలని హిందూ ధార్మిక మండలి పట్టణ కన్వీనర్ గరికపాటి రమేష్‌బాబు ఈఓ బాపిరెడ్డిని కోరారు. ఆలయ పరిసర ప్రాంతాల్లో నిత్యం వాహనాల రాకపోకలతో భక్తులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్లు, బస్సులు, టూరిస్టు వాహనాల పార్కింగ్ కోసం శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. ప్రస్తుతం ఉన్న స్నాన ఘట్టాలు, మరుగుదొడ్లు చాలడం లేదన్నారు. అలాగే ఉత్సవాల సందర్భంగా భక్తులకు ఎదురయ్యే సమస్యలను ఆయనకు వివరించారు.